



తహశీల్దార్ కార్యాలయం వద్ద గుడిసెలు వేసి నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు

పేదలకు సెంటు స్థలం ఇవ్వలేరా..?

◆ ఇళ్ల స్థలాల కోసం సిపిఎం వినూత్న నిరసన

◆ తహశీల్దార్ కార్యాలయంలో గుడిసెలు వేసి ఆందోళన

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

సొంత ఇళ్లు లేక అద్దె ఇళ్లలో ఏళ్ల తరబడి జీవనం సాగిస్తున్న పేదలకు సెంటు స్థలం ఇవ్వలేరా అంటూ సిపిఎం నాయకులు ప్రభుత్వం, అధికారులను ప్రశ్నించారు. నగరంలో పేదలు వేసుకున్న గుడిసెలకు పట్టాలు ఇవ్వాలని, స్థలాలు లేని వారికి ఇంటి స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సిపిఎం ఆధ్వర్యంలో బుధవారం నాడు అంతపురం తహశీల్దార్ కార్యాలయం వద్ద వినూత్నంగా నిరసన చేపట్టారు. తహశీల్దార్ కార్యాలయ ఆవరణంలో పేదలతో కలిసి గుడిసెలు ఏర్పాటు చేసి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం నగర 1వ కమిటీ కార్యదర్శి వి.రామిరెడ్డి మాట్లాడుతూ సెంటు స్థలం ఇవ్వాలని పేదలు వేడుకుంటుంటే ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం పట్టించుకోకపోవడం దుర్మార్గం అన్నారు. ఈ సమస్యపై సిపిఎం ఆధ్వర్యంలో వివిధ రూపాల్లో నిరసనలు, రెవెన్యూ అధికారులకు విజ్ఞాపన పత్రాలు తెలియజేసినా ఫలితం లేదన్నారు. కబ్జాదారులకు సహకరిస్తూ పేదలను విస్మరించేలా ప్రభుత్వ కార్యాలయాలు పని చేస్తుండడం విచారకరం అన్నారు. రాజకీయ నాయకులు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు, భూకబ్జాదారులకు వందలాది ఎకరాల ప్రభుత్వ భూములను దారాదత్తం చేస్తున్న అధికారులు పేదలకు మాత్రం సెంటు స్థలం ఇవ్వడం లేదన్నారు. ప్రభుత్వ స్థలంలో పేదలు గుడిసెలు వేసుకుంటే మాత్రం రాత్రికిరాత్రే వచ్చి వాటిని కూలదోయడం ఎంత వరకు న్యాయం అని ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, పట్టాలు మంజూరు చేయాలని కోరారు. ప్రభుత్వ స్థలాలను కబ్జా చేసిన వారిపై క్రిమినల్ చర్యలు తీసుకుని కఠినంగా శిక్షించాలని కోరారు. లేకుంటే ఆందోళన మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం డిప్యూటీ తహశీల్దార్ సిపిఎం నాయకుల వద్దకొచ్చి మాట్లాడారు. రెండురోజుల్లోపు ప్రభుత్వ స్థలాన్ని గుర్తించి అర్హులైన వారందరికీ ఇళ్ల స్థలాలు ఇస్తామని హామీ ఇచ్చారు. దీంతో నిరసన కార్యక్రమం విరమించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నగర నాయకులు వెంకటనారాయణ, ప్రకాష్, మసూద్, బాబు, వలీ, వెంకటేష్, నాగభూషణం, బాబా, ఇర్ఫాన్, ఎటిఎం నాగరాజు, ఎంపిటీసీ రమీజాబీ, ఎన్టీఆర్ శీన, ప్రసాద్, రాజు, గఫూర్, ఎర్రిస్వామి, మున్ని, శివ, రామాంజి, ఇస్మాయిల్, నాగరాజు పాల్గొన్నారు.



అనంతపై సోలార్ కన్ను..!

◆ లక్షల ఎకరాలు దారదత్తానికి ప్రభుత్వం సిద్ధం

◆ పెద్ద ఎత్తున భూ కేటాయింపునకు చర్యలు

◆ పలు మండలాల్లో భూమి గుర్తింపు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

నిత్యం క్షామ పీడిత ప్రాంతంగా ఉన్న అనంతపురం జిల్లాలో ఇక్కడి ప్రజల జీవనం దుర్భరంగా మారింది. వర్షాధారంపై ఆధారపడి పంటలు సాగు చేసి నష్టాలను చవిచూస్తున్న రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. మరికొంత మంది ఇక్కడ బతుకుదెరువు లేదంటూ బెంగళూరు, కేరళ తదితర రాష్ట్రాలకు పొట్టచేతబట్టుకుని వలసలు పోతున్నారు. ఇదిలాఉంటే ప్రకృతి వైపరీత్యం మరికొంత మందికి కాసులు కురిపించే విధంగా మారడం గమనార్హం. ఇక్కడి వర్షాభావ పరిస్థితులు సోలార్ విద్యుత్ ఉత్పత్తికి వరంగా మారింది. ఎత్తు ప్రాంతంగా ఉండి గాలులకు మేఘాలు తెలిపోయి వర్షాలు పడని పరిస్థితులు నెలకుని ఉండగా, ఇది పవన విద్యుత్ ఉత్పత్తికి వరంగా మారింది. దీంతో ఇప్పుడు సోలార్, పవన విద్యుత్ కంపెనీల కన్ను అనంతపురం జిల్లాపై పడింది. పెద్దఎత్తున ఈ కంపెనీలు ఇప్పటికే విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలను ఏర్పాటు చేసుకుని కాసులు కురిపించుకుంటున్నాయి. మరికొన్ని కంపెనీలు సైతం ముందుకొచ్చేందుకు సిద్ధమవుతున్నాయి. దీంతో లక్షలాది ఎకరాల భూములు ఇప్పుడు కంపెనీల పరం కానున్నాయి.

4811.89 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి

ఉమ్మడి అనంతపురం జిల్లా పరిధిలో చూసినప్పుడు పవన, సోలార్ విద్యుత్ పవర్ ప్లాంట్ల ద్వారా జరుగుతున్న విద్యుత్ ఉత్పదాన 4811.89 మెగావాట్లుగా ఉంది. ఇందులో అనంతపురం జిల్లా పరిధిలో పవన విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం 2628 మెగావాట్లు కాగా, సత్యసాయి జిల్లాలో 375.24 మెగావాట్లు ఉంది. ఇక అనంతపురం జిల్లా పరిధిలో సౌర విద్యుత్ 612.57 మెగావాట్లు కాగా, సత్యసాయి జిల్లా పరిధిలో 1193 మెగావాట్లు ఉంది. మొత్తంగా రెండు జిల్లాల పరిధిలో ఇప్పటికే 4811.89 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు ఏర్పాటై ఉన్నాయి.

పెద్దఎత్తున భూ కేటాయింపులకు రంగం సిద్ధం

సోలార్ విద్యుత్ ఉత్పత్తి కోసం ఇప్పుడిచ్చిన భూములే కాకుండా ఇంకా పెద్దఎత్తున భూ పందేరానికి ప్రభుత్వం సిద్ధపడినట్టు కనిపిస్తోంది. ఇప్పటికే రాయదుర్గం నియోజకవర్గం పరిధిలో నాలుగు మండలాల పరిధిలో పది వేల ఎకరాల వరకు గుర్తించే ప్రక్రియ ప్రారంభమైంది. ఇదే నియోజకవర్గం పరిధిలో మొత్తం 75 వేల ఎకరాలు ఇవ్వడానికి ప్రభుత్వం సుముఖంగా ఉన్నట్టు సమాచారం. ఇకపోతే సత్యసాయి జిల్లా పరిధిలో తలుపుల, ఎన్‌పికుంట, కడప జిల్లాలోని చక్రయాపేట పరిధిలో మొత్తం 20 వేల ఎకరాలు ఇవ్వడానికి అనుకూలంగా ఉన్నట్టు గుర్తించారు. ఓబుళదేవం చెరువు మండలం, నల్లమాడ, ఆమడగూరు మూడు మండలాల పరిధిలో 12 వేల ఎకరాలు సోలార్ పార్కుకు అనుకూలంగా గుర్తించారు. కంబదూరు మండలం పరిధిలోని రాళ్ల అనంతపురం, రాళ్లపల్లి, కురాకులపల్లి గ్రామ పరిధిలో మరో 12 వేల ఎకరాలు అనుకూలంగానున్నట్టు గుర్తించారు. ఇలా అనేక చోట్లపెద్దఎత్తున సోలార్‌కు అను కూలమైన భూమలున్నట్టు గుర్తించారు. వీటిని ముందుకొచ్చే కంపెనీలకు కట్టబెట్టేందుకు రంగం సిద్ధమైనది చెప్పవచ్చు.



అనంతపురం పాలిటెక్నిక్ కళాశాలను పరిశీలిస్తున్న జిల్లా సంయుక్త కలెక్టర్

కట్టుదిట్టంగా ఎమ్మెల్సీ ఎన్నికల కౌంటింగ్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

త్వరలో జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల కౌంటింగ్‌కు సంబంధించి కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లను చేయాలని జిల్లా సంయుక్త కలెక్టర్ కేతన్‌గార్గ్ పోలీసు, రెవెన్యూ అధికారులను ఆదేశించారు. కడప, అనంతపురం, కర్నూలు పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎన్నికలకు సంబంధించి ఓట్లు భద్రపరిచేందుకు స్ట్రాంగ్ రూమ్, ఓట్ల లెక్కింపునకు సరైన గదులు ఎంపిక చేసే నిమిత్తం అనంతపురం నగరంలోని పాలిటెక్నిక్ కళాశాలను బుధవారం పరిశీలించారు. జిల్లాకు సంబంధించి ఎన్నికల సామగ్రి పంపిణీ, వాహనాల పార్కింగ్‌కు స్థలాన్ని పరిశీలించారు. సరైన బారికేట్లతో ఏర్పాట్లు చేపట్టాలని పోలీసులను ఆదేశించారు. స్ట్రాంగ్ రూమ్‌లో కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసి, సీసీ కెమెరాలు ఎల్లవేళలా పనిచేసేలా చూడాలన్నారు. కౌంటింగ్ పూర్తయ్యేంత వరకు వీడియోగ్రఫీని ఏర్పాటు చేయాలన్నారు. చీఫ్ ఎలక్షన్ కమిషన్ జారీ చేసిన సూచనలు మేరకు కౌంటింగ్ సక్రమంగా జరపాలని సంబంధిత అధికారులకు సూచించారు. రెవెన్యూ అధికారులకు కౌంటింగ్ కేంద్రంలో అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు.



అభివాదం తెలుపుతున్న అఖిలపక్ష పార్టీల నాయకులు

ఐక్యంగా పోరాడి అప్పర్ భద్రను ఆపుదాం

అప్పర్ భద్రతో రాయలసీమ ఎడారే

ఎన్నికల లబ్ధి కోసం మోడీ ప్రభుత్వం కుట్ర

సిఎం జగన్, ఎంపీలు మొద్దు నిద్ర వీడాలి

రౌండ్ టేబుల్ సమావేశంలో అఖిలపక్షాల నేతలు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

రాయలసీమతో రాష్ట్రానికి తీవ్ర నష్టాన్ని సృష్టించేలా ఏర్పాటు చేస్తున్న అప్పర్ భద్రా ప్రాజెక్టు నిర్మాణాన్ని అఖిలపక్ష పార్టీలు, ప్రజా సంఘాలు, మేధావులు, ఐక్యంగా పోరాడి ఆపుదామని అఖిలపక్ష పార్టీల నేతలు పిలుపునిచ్చారు. బుధవారం రైతు సంఘం ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో అప్పర్ భద్రా నిర్మాణం- నష్టం అంశంపై అఖిల పక్ష పార్టీలు, ప్రజా సంఘాలతో సదస్సు నిర్వహించారు. రైతు సంఘం జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షులు మల్లికార్జున అధ్యక్షతన నిర్వహించిన సదస్సుకు సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డి.జగదీష్, సాగునీటి ప్రాజెక్టుల విశ్లేషక నిపుణుడు లక్ష్మినారాయణ, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తులసిరెడ్డి, సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్, సిపిఐఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఇండ్ల ప్రభాకర్‌రెడ్డి, సిపిఐ అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లా కార్యదర్శులు వేమయ్య యాదవ్, జాఫర్‌లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వారు మాట్లాడుతూ కర్ణాటక ప్రభుత్వం అక్రమంగా అప్పర్ భద్ర ప్రాజెక్టు నిర్మించడం దుర్మార్గంగా ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం స్వార్థ రాజకీయాలు చేస్తూ, కర్ణాటక ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు అప్పర్ భద్రా ప్రాజెక్టు నిర్మాణానికి పూనుకుందన్నారు. అందుకు రూ.వేల కోట్లు నిధులు విడుదల చేసిందని ధ్వజమెత్తారు. ప్రాజెక్టు నిర్మాణం జరిగితే భవిష్యత్తులో రాయలసీమ ఎడారిగా మారే ప్రమాదం ఉందన్నారు. తెలంగాణ రాజోలు బండ ప్రాజెక్ట్, శ్రీశైలం డ్యాంకు సైతం నీరు అందని దుస్థితి ఏర్పడుతుందన్నారు. ప్రాజెక్టు నిర్మాణం జరిగితే జరిగే నష్టాలను అంచనా వేసి రాష్ట్ర ప్రజలకు తెలిపేందుకు ఈ నెల 13 నుంచి 24వ తేది వరకు ఎపి సాగు నీటి ప్రాజెక్టుల కాల్వలపై పర్యటనలు చేసి ప్రజలను ఐక్యం చేసి పోరాటాలకు శ్రీకారం చుడదామన్నారు. అక్రమ ప్రాజెక్టుల నిర్మాణంపై ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి బిజెపికి మోకరిల్లే వైఖరి వీడాలన్నారు. మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు నోరు మెదపాలన్నారు. ప్రజలను కలుపుకుని కేంద్రంపై ఒత్తిడి పెంచేందుకు కృషి చేయాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో పండ్ల తోటల సంఘం నాయకులు అనంత రాముడు, పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి పోతుల నాగరాజు, టిడిపి అధికార ప్రతినిధి శివబాల, బిసిసెల్ జిల్లా కార్యదర్శి నరసింహులు, రాము, మానవ హక్కుల సంఘం నాయకుడు బాషా, సిపిఐ ఎంఎల్ నాయకుడు చంద్రశేఖర్, రైతు కూలీ సంఘం నాయకుడు నాగరాజు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు రామక్రిష్ణ, కేశవ రెడ్డి, శ్రీరాములు, లింగమయ్య, రమణ తదితరులు పాల్గొన్నారు.

మద్దతుధరతో శనగపంట కొనుగోలు

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురం జిల్లాలో రబీ 2022-23లో పప్పుశనగలు పండించిన రైతుల నుంచి ప్రభుత్వం మద్దతు ధర క్వింటా రూ.5,335తో శనగలను కొనుగోలు చేయనుందని జిల్లా వ్యవసాయ అధికారులు బుధవారం ఓ ప్రకటనలో తెలియజేశారు. జిల్లాలో శనగలు పండించిన రైతులు రైతుభరోసా కేంద్రాల ద్వారా పేర్లను నమోదు చేసుకోవాల్సుంది. ఆయా గ్రామాల్లో ఈ-క్రాప్‌లో శనగ పంట నమోదు చేసుకున్న రైతుల నుంచి మాత్రమే ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని తెలియజేశారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

సిసిఐని మూసివేసే చర్యలు అడ్డుకుందాం

ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి

అనంతపురం కలెక్టరేట్ : కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సిసిఐ)ను మూసి వేసేందుకు కేంద్ర ప్రభుత్వం చేస్తున్న కుట్రలను తిప్పికొడదామని ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తరిమెల నాగరాజు, ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రైతాంగంపై కక్షకట్టినట్లుగా వ్యవహరిస్తోందని విమర్శించారు. 2023 - 24 బడ్జెట్‌లో వ్యవసాయం, అనుబంధ రంగాలకు భారీ ఎత్తున నిధులు తగ్గించిందన్నారు. ఒక వైపు దేశవ్యాప్తంగా రైతులు రైతు సంఘాలు మద్దతు ధరలకు చట్టబద్ధత కల్పించాలని, రైతుల పండించిన అన్ని పంటలను ప్రభుత్వం కొనుగోలు చేసేందుకు అవసరమైన యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలని కోరుతున్నారని తెలిపారు. అందుకు భిన్నంగా కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాకి కేవలం రూ.లక్ష మాత్రమే కేటాయించిందన్నారు. వ్యవసాయ అనుబంధ రంగానికి గతం కంటే 5 శాతం రూ.1,51521 కోట్లు కేటాయించగా, ఈ ఏడాది రూ.1,44,214 కోట్లు కేటాయించారని తెలిపారు. ఉపాధి హామీ పథకానికి 18 శాతం రూ.29 వేల కోట్లు తగ్గించేశారన్నారు. ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాకు నిధుల కోత విధించాయని తెలిపారు. రైతులకు ప్రయోజనకరంగా ఉన్న ప్రభుత్వం కాటన్ కార్పొరేషన్ ఆయిల్ ఫుడ్, ఫుడ్ కార్పొరేషన్ వంటి వివిధ సంస్థల ద్వారా జోక్యం చేసుకొని మద్దతు ధరలు కల్పించి రైతులను ఆదుకునేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాల్సింది ఉందన్నారు. ఆ సంస్థలకు నిధులు పెంపుదల చేయాలని కోరారు. ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు ఐక్య పోరాటాలు చేద్దామని తెలిపారు.

జెఎన్‌టియు సివిల్ ఇంజినీరింగ్ విభాగానికి పేటెంట్

అనంతపురం : అనంతపురము జేఎన్టీయూ ఇంజినీరింగ్ కళాశాల సివిల్ ఇంజినీరింగ్ విభాగం సీనియర్ ఆచార్య హెచ్.సుదర్శనరావు, ఆచార్య వైశాలి ఘోర్పడే ఆధ్వర్యంలో కాంక్రీట్‌లో పగుళ్లు ఏర్పడి నప్పుడు బ్యాక్టీరియాను నివారించే ప్రక్రియను చేపట్టారు. దీనికి ఇండియా పేటెంట్ లభించిందని ఉపకులపతి ఆచార్య జి.రంగజనార్ధన బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ఉపకులపతి కాన్ఫరెన్స్ హాలు నందు ఆచార్య హెచ్.సుదర్శన రావు, ఆచార్య వైశాలి జి. ఘోర్పడేను బుధవారం సన్మానించారు. అనంతరం ఉపకులపతి ఆచార్య జి. రంగ జనార్ధన మాట్లాడుతూ ఇటువంటి పేటెంట్ మంజూరవ్వడం యూనివర్సిటీకి, కళాశాలకు గర్వకారణం అన్నారు. యువ అధ్యాపకులు మరిన్ని పేటెంట్స్ మంజురయ్యే విధంగా కృషి చేయాలన్నారు. వర్శిటీలోని అధ్యాపకులు మంచి పరిశోధనలు, జర్నల్స్ పబ్లిస్ చేస్తున్నారని, వాటికి పేటెంట్స్ మంజూరయ్యే విధంగా కృషి చేయాలని తెలిపారు.

కార్యకర్తల శ్రమతోనే పదవులు : విప్ కాపు

ప్రజాశక్తి-కణేకల్లు

రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం అధికారంలో రావడానికి, జగన్మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావడానికి, రాష్ట్రంలో 151 మంది ఎమ్మెల్యేలు గెలవడానికి ప్రధాన కారణం పార్టీ కార్యకర్తలేనని.. వారి శ్రమదానంతోనే తాము అధికారం చేపట్టామని ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలోని కెసిఎన్‌ఆర్ ఫంక్షన్ హాల్‌లో గ్రామ సచివాలయ కన్వీనర్లు ఎంపీపీ, వైస్ ఎంపీపీ, సర్పంచులు, ఎంపీటీసీలు, వాలంటీర్లు, గృహసారథుల శిక్షణ కార్యక్రమం విప్ కాపు రామచంద్రారెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పై తెలిపిన వీరందరూ ప్రతి ఇంటికి వెళ్లి ప్రతి కుటుంబాన్ని ప్రేమతో ఆప్యాయతతో పలకరించి వారికి ఎన్ని ప్రభుత్వ సంక్షేమ పథకాలు వస్తున్నాయో తెలియజేయాలన్నారు. జగనన్న ప్రభుత్వంలో ఒక్క రూపాయి అవినీతికి తావులేకుండా నేరుగా లబ్ధిదారుల ఖాతాలోకి జమతున్నాయన్నారు టిడిపి నాయకులు చేస్తున్న విమర్శలను ఎవరు పట్టించుకోవాల్సిన అవసరం లేదన్నారు. మరోసారి వైసిపి ప్రభుత్వం అధికారంలో రావడానికి కృషిచేయాలన్నారు. రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో ఒకే వాహనంలో టిడిపి, వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థులు ప్రచారానికి వెళ్దామని ప్రజలు ఎవరిపై మొగ్గుచూపుతారో వారి నిర్ణయానికే వదిలేస్తామన్నారు. వైసీపీ కార్యకర్తలకు, ప్రజలకు తన కుటుంబ సభ్యుల కన్నా ఎక్కువ ప్రాధాన్యత ఇస్తూ వారి సమస్యలు పరిష్కరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పిటిసి పద్మావతి, ఎంపీపీ సంధ్య, వైస్ ఎంపీపీ లీలావతి, టౌన్ కన్వీనర్ కేశవరెడ్డి, రూరల్ బ్యాంక్ అధ్యక్షులు పైనేటి తిమ్మప్ప, మాజీ ఎంపీపీ రాజగోపాల్‌రెడ్డి, మాజీ జెడ్పిటిసి నాగిరెడ్డి, డాక్టర్ సోమన్న, ఉప సర్పంచి నబీసా, వక్ఫ్‌బోర్డ్ డైరెక్టర్ మహబూబ్ పీరా, వార్డు మెంబర్ హనుమంతరావు, మండల కన్వీనర్ చిక్కన్న తదితరులు పాల్గొన్నారు



సమావేశంలో మాట్లాడుతున్న విప్ కాపు రామచంద్రారెడ్డి

అనంతపురం : రానున్న ఎన్నికల్లో సచివాలయ కన్వీనర్లు, గృహసారథులే వైసిపి విజయసారథులని అనంతపురం ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి తెలిపారు. నగరంలోని గుత్తి రోడ్డులో ఉన్న కేటీఆర్ ఫంక్షన్ హాల్‌లో అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి క్లస్టర్ 1, 4 సచివాలయాల కన్వీనర్లు, గృహసారథులు, వాలంటీర్ల శిక్షణ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా వైసీపీ పరిశీలకులు వెంకట్‌రెడ్డి యాదవ్ హాజరయ్యారు. కార్యక్రమంలో వైసీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య, మేయర్ మొహమ్మద్ వసీం, ఉర్దూ అకాడమీ చైర్మన్ నదీం అహ్మద్, మాజీ మేయర్ రాగే పరశురాం, డిప్యూటీ మేయర్లు వాసంతి సాహిత్య, కోగటం విజయభాస్కర్‌రెడ్డి, డైరెక్టర్లు గౌస్‌బేగ్, శ్రీదేవి, వక్ఫ్‌బోర్డు అనంతపురం జిల్లా చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్, మార్కెట్ యార్డు చైర్మన్ ఫయాజ్, బీసీ రమేష్‌గౌడ్, వైసీపీ మహిళా విభాగం నగర అధ్యక్షురాలు కృష్ణవేణి, 1, 4 క్లస్టర్ల పరిధిలోని కార్పొరేటర్లు, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి రాతిదూలం లాగుడు పోటీలు

గుత్తి : తొండపాడు బొలికొండ రంగనాథస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఏటా నిర్వహించే రాష్ట్ర స్థాయి ఒంగోలు జాతి రాతి దూలం లాగుడు పోటీలు బుధవారం ప్రారంభమయ్యాయి. పోటీలను వైసిపి సీనియర్ నాయకుడు బి.శ్రీనివాసరెడ్డి, నిర్వాహకులు, మాజీ జెడ్పీటీసీ ప్రవీణ్‌కుమార్ యాదవ్, తొండపాడు సింగిల్ విండో అధ్యక్షుడు పురుషోత్తం యాదవ్‌లు ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ ఏటా రంగనాథ స్వామి తిరునాల సందర్భంగా వృషభాల పోటీలు నిర్వహించడం హర్షించదగ్గ విషయమన్నారు. ఎద్దుల పోటీల నిర్వాహకులను శ్రీనివాస్‌రెడ్డిని అభినందించారు. గ్రామంలో జరిగిన పోటీలకు జిల్లా నుంచే కాక కడప, కర్నూలు, మహబూబ్ నగర్, ఒంగోలు ప్రాంతాల వృషభాలు పాల్గొంటున్నాయని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రాధికా, సర్పంచి రుక్మిణమ్మ, వైసిపి మండల, పట్టణ కన్వీనర్లు గోవర్ధన్‌రెడ్డి, నాయకులు బేడల వెంకటరాముడు, కొత్తపల్లి రంగయ్య, గురుప్రసాద్, కోత్తపేట రాము, సుధాకర్, హనుమంతు, రాజన్న, లక్ష్మీనారాయణ, సర్పంచి చితంబరి కౌన్సిలర్లు ఫారుక్, వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎద్దు పొడిచి రైతుకు గాయాలు

మండలంలోని తొండపాడు గ్రామంలో ఎద్దు పొడిచి ఓ రైతుకు తీవ్ర గాయాలయ్యాయి. నంద్యాల జిల్లా ప్యాపిలి మండలం రాచవాండ్లపల్లికి చెందిన టి.రామ్మోహన్ అనే రైతు తొండపాడు గ్రామంలో బుధవారం నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి రాతి దూలం లాగుడు పోటీలను తిలకించడానికి వచ్చాడు. అయితే పోటీల ఆవరణలో కట్టేసి ఉన్న ఎద్దు తాడు తెగిపోవడంతో అది జనాల మీదకి దూసుకెళ్లింది. రామ్మోహన్‌ను పొడిచింది. అప్రమత్తమైన స్థానికులు ఎద్దును పట్టుకొని కట్టివేశారు.

నారాయణ కళాశాలను సీజ్ చేయండి

ఆర్‌ఐఓకు ఐక్య విద్యార్థి సంఘాల వినతి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

అనంతపురం నగరంలో ఫీజుల పేరుతో విద్యార్థులను వేధిస్తున్న నారాయణ కళాశాలను సీజ్ చేయాలని ఐక్య విద్యార్థి సంఘం నేతలు కోరారు. ఈ మేరకు ఆర్‌ఐఓ సురేష్‌బాబును బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పరమేష్, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు కుల్లాయస్వామి, ఏపీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఆకుల రాఘవేంద్ర, బీసీ,ఎస్సీ,ఎస్టీ మైనారిటీ విద్యార్థి సమాఖ్య సురేష్ యాదవ్, ఎఐఎస్‌బి జిల్లా కార్యదర్శి పృధ్వీ మాట్లాడుతూ రెండు రోజుల క్రితం నారాయణ జూనియర్ కళాశాలలో భవ్యశ్రీ అనే విద్యార్థినిని ఫీజుల కోంస యాజమాన్యం వేధించిందన్నారు. అందరి ముందు ఫీజు కట్టాలని అవమానకరంగా మాట్లాడారని చెప్పారు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన విద్యారిథని కళాశాల భవనంపై నుంచి దూకి ఆత్మహత్యకు యత్నించిందన్నారు. ఈ ఘటనకు నారాయణ కళాశాల యాజమాన్యమే కారణం అన్నారు. కళాశాల యాజమాన్యంపై క్రిమినల్ కేసులు నమోదు చేసి, బాధ్యులను తక్షణం అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. కళాశాలను వెంటనే సీజ్ చేయాలన్నారు. లేనిపక్షంలో జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనకు శ్రీకారం చుడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకుడు సూర్యప్రకాష్, ఎఐఎస్ఎఫ్ నాయకులు ఉమామహేష్ పాల్గొన్నారు.



ఆర్ఐఓకు వినతిపత్రం ఇస్తున్న ఐక్య విద్యార్థి సంఘం నాయకులు

అర్హులకు ఇళ్ల స్థలాలు, పట్టాలు ఇవ్వాలి

సిపిఎం పట్టణ కార్యదర్శి బి. శ్రీనివాసులు

ప్రజాశక్తి-గుంతకల్లు

అర్హులైన పేదలందరికీ ఇళ్ల స్థలాలు, పట్టాలు ఇవ్వాలని సిపిఎం పట్టణ ప్రధాన కార్యదర్శి బి.శ్రీనివాసులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సిపిఎం నాయకులు మండల తహశీల్దారు కార్యాలయం ఎదుట బుధవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ జగనన్న గృహ నిర్మాణ పథకం కింద ఇళ్లు నిర్మించి ఇస్తామని, స్థలాలు కావాలనుకున్న పేదలు అర్జీ పెట్టుకున్న 90 రోజుల్లో స్థలం మంజూరు చేస్తామని గొప్పలు చెబుతోందని అన్నారు. జగనన్న ఇళ్ల నిర్మాణం కింద గుంతకల్లు పట్టణంలో 4,784 ఇళ్లు మంజూరు అయ్యాయన్నారు. ఐతే అందులో 2,384 ఇళ్లు పునాదులకే పరిమితం అయ్యాయన్నారు. మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయన్నారు. ఇంటి నిర్మాణాలు పూర్తికాక పోవడానికి ప్రభుత్వ విధానమే కారణం అన్నారు. ఇంటి నిర్మాణం మొత్తం ప్రభుత్వం చేస్తుందని మొదట్లో చెప్పి, ఇళ్లు మంజూరు అయిన తర్వాత నిర్మాణానికి రూ.1.80 లక్షలు మాత్రమే ప్రభుత్వం ఇస్తోందన్నారు. పెరిగిన సిమెంట్, స్టీల్ ధరలు, ఇసుక కొరత, నీటి సదుపాయాలు లేకపోవడం, ప్రభుత్వం ఎంపిక చేసిన స్థలాలు ఊరికి దూరంగా ఉండడం వంటి సమస్యలతో పేదలు ఇళ్ల నిర్మాణానికి సుముఖత చూపడం లేదన్నారు. భవిష్యత్తులో ఇళ్ల స్థలాలు మంజూరు కావని అధికారులు లబ్దిదారులపై ఒత్తిడి పెంచారన్నారు. దీంతో పట్టణంలో సుమారు 3,020 మంది నిరుపేదలు ఇళు నిర్మించుకోలేక పోయారన్నారు. వైసిపి వార్డు ఇన్‌ఛార్జిలు కాంట్రాక్టర్లుగా మారి నాసిరకంగా పునాదులు నిర్మించి బేస్మెంట్ బిల్లులను స్వాహా చేస్తున్నారని అన్నారు. జగనన్న ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గుంతకల్లు పట్టణం, మండలంలో కొందరు అధికార పార్టీకి చెందిన నాయకులు యథేచ్ఛగా ప్రభుత్వ స్థలాల భూకబ్జాలకు పాల్పడుతున్నారని తెలిపారు. అనంతరం తహశీల్దారు బి.రాముకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్య క్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శివర్గ సభ్యులు దాసరి శ్రీనివాసులు, మారుతి ప్రసాద్, కసాపురం రమేష్, సాకే నాగరాజు, జగ్గలి రమేష్, అబ్దుల్లా, వెంకీ, చందు తదితరులు పాల్గొన్నారు.



గుంతకల్లులో నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు

గార్లదిన్నె : మండల పరిధిలోని ముకుందాపురం గ్రామంలో పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలని సిపిఎం ఆధ్వర్యంలో తహశీల్దారు కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి చెన్నారెడ్డి మాట్లాడుతూ ముకుందాపురంలో ఇళ్ల పట్టాల కోసం మూడు నెలల క్రితం అర్జీ ఇచ్చారన్నారు. దీనిపై అధికారులు విచారణ కూడా చేపట్టారన్నారు. అయినా ఇప్పటివరకు పట్టాలు మంజూరు చేయలేదని పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం గుర్తించి ఇళ్ల పట్టాలను పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం తహశీల్దారు ఉషారాణికి వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో నల్లప్ప, నాగమ్మ, ఓబులేసు తదితరులు పాల్గొన్నారు

11, 12న అరసం రాష్ట్ర మహాసభలు

ప్రజాశక్తి-అనంతపురం

ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం (అరసం) 19వ రాష్ట్ర మహాసభలు ఈనెల 11, 12 తేదీలలో గుంటూరు జిల్లా తెనాలిలోని శ్రీ తెనాలి రామకృష్ణ కవి కళాక్షేత్రంలో నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఆచార్య రాచపాలెం చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. రెండు రోజుల రాష్ట్ర మహాసభలలో అభ్యుదయ కవులు, రచయితలు పాల్గొంటారన్నారు. పుస్తకాల ఆవిష్కరణ కార్యక్రమం ఉంటుందని వెల్లడించారు. అనంతపురం నుండి జిల్లా శాఖ అధ్యక్షులు బి.ఈశ్వర్ రెడ్డి, డాక్టర్ శాంతి నారాయణ, డాక్టర్ నానీల నాగేంద్ర, డాక్టర్ తన్నీరు నాగేంద్ర, చెట్ల ఈరన్న, ఎల్‌ఆర్ వెంకటరమణ, మధుర శ్రీ, వి.రవీంద్రారెడ్డి, పూజారి ఈరన్న, మణికంఠ తదితరులు రాష్ట్ర మహాసభలలో పాల్గొంటారని అరసం అనంతపురం జిల్లా శాఖ ప్రధాన కార్యదర్శి డాక్టర్ నానీల నాగేంద్ర తెలిపారు.

ఉపాధి హామీ కూలీల సంఖ్య పెంచాలి

గుత్తి : గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి పనులు చేసే కూలీల సంఖ్యను పెంచాలని ఎంపీడీవో చిట్రా శ్రీనివాసులు జాతీయ ఉపాధి హామీ పథకం సిబ్బందిని ఆదేశించారు. బుధవారం స్థానిక కార్యాలయంలో ఏపీవో మద్దిలేటితో కలిసి మండలంలోని ఉపాధి సిబ్బంది ఈసీ, సాంకేతిక, క్షేత్ర సహాయకులతో ఎంపీడీవో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామాల్లో రోజూ ఉపాధి పనులకు వస్తున్న కూలీల సంఖ్యను వేసవికి ముందే పెంచాలన్నారు. కూలీలకు ఉపాధి పనులపై అవగాహన కల్పించి పనుల లక్ష్యం త్వరగా పూర్తి చేయాలన్నారు. పనులు జరిగే చోట వసతులు కల్పించాలని ఆదేశించారు. పనికి తగ్గ కూలి వచ్చేలా పనులు కల్పించాలన్నారు. వచ్చే వేసవిలో కూలీలకు మజ్జిగ, తాగునీరు, నీడ కల్పించేందుకు టెంట్లు ఏర్పాట్లను ఇప్పటి నుంచే సిద్ధం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సాంకేతిక సహాయకుడు లోకేష్, క్షేత్ర సహాయకులు రంగయ్య, ఈశ్వర్, గోపాల్ పాల్గొన్నారు.

పేదల ఇళ్ల స్థలాలకు ఎమ్మెల్యే కేశవ్ అడ్డు

మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి

ప్రజాశక్తి-ఉరవకొండ

పేదలకు ఇళ్ల స్థలాలు రాకుండా ఉరవకొండ నియోజకవర్గం ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ అడ్డుపడుతున్నారని మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి పేర్కొన్నారు. ఉరవకొండ మండలంలోని చిన్న మూస్టూరు గ్రామంలో మార్కెట్ యార్డ్ వైస్ ఛైర్మన్ సుంకన్న ఆధ్వర్యంలో' గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల ద్వారా పొందిన లబ్ధిని వివరించారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వాటిని పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. నియోజకవర్గ పేద ప్రజలకు ఇళ్ల స్థలాలు రాకుండా ఎమ్మెల్యే కేశవ్ అడ్డుపడుతున్నారని ఆరోపించారు. కేశవ్ సొంత పంచాయతీలో అర్హులకు ఇళ్ల పట్టాలు రాకుండా అడ్డుపడడమే కాకుండా, ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణాలకు అడ్డుపడుతున్నారని తెలిపారు. టిడిపి అధినేత చంద్రబాబు ఆదేశాల మేరకు ఇళ్ల స్థలాలకు సంబంధించి కోర్టులో కేసులు వేస్తున్నారని పేర్కొన్నారు. అనంతరం మార్కెట్ యార్డ్ వైస్ ఛైర్మన్ సుంకన్న ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వర్‌రెడ్డితో పాటు ప్రజా ప్రతినిధులను, పంచాయతీ సిబ్బందిని సన్మానించారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ ఛైర్మన్ సుశీలమ్మ, జెడ్పిటిసి పార్వతమ్మ, విడపనకల్లు ఎంపీపీ కరణం పుష్పావతి భీమ్‌రెడ్డి, జెడ్పిటిసి హనుమంతు, సర్పంచి రామాంజనేయులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మాజీ ఎమ్మెల్యే విశ్వ, ప్రజా ప్రతినిధులను సన్మానిస్తున్న గ్రామస్తులు

మున్సిపల్ డీఈ హేమచంద్రపై చర్యలు తీసుకోవాలి

గుంతకల్లు : మున్సిపల్ కార్యాలయంలో పనిచేస్తున్న మహిళా ఉద్యోగినుల పట్ల అసభ్యరంగా ప్రవర్తిస్తున్న డీఈ హేమచంద్ర కుమార్‌పై చర్యలు తీసుకోవాలని సీపీఐ ఎంఎల్ న్యూడెమొక్రసి నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ డివిజన్ కార్యదర్శి బి.సురేష్ మాట్లాడుతూ మున్సిపల్ కార్యాలయంలో ఇంజనీరింగ్ శాఖలో విధులు నిర్వహిస్తున్న డిఇ హేమచంద్ర కుమార్ కార్యాలయంలో పనిచేస్తున్న మహిళా ఉద్యోగులను, సచివాలయం, వార్డు మహిళా ఉద్యోగుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తూ వేధింపులకు గురి చేస్తున్నాడన్నారు. అతని వికృత చేష్టలకు భయపడి ఎవరికీ చెప్పుకోలేక కార్యాలయానికి రావడానికి మహిళా ఉద్యోగులు జంకుతున్నారు. ప్రభుత్వం మహిళల రక్షణ కోసం అనేక చట్టాలు తెచ్చినా ఇలాంటి ఆగడాలు ఆగడం లేదన్నారు. తక్షణం స్పందించి ఇంజినీరింగ్ సెక్షన్ డీఈ హేమచంద్ర కుమార్‌పై విచారణ జరిపి అతన్ని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రజలు, మహిళలతో కలిసి ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. అనంతరం మున్సిపల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు విశ్వనాథ్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు చిన్నా, రామచంద్ర పాల్గొన్నారు.

సేవాలాల్ జయంతి ఉత్సవాలను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-గుత్తి

బంజారాల ఆరాధ్య దైవమైన శ్రీ సంత్ సేవాలాల్ జయంతి ఉత్సవాలను జయప్రదం చేయాలని అల్ ఇండియా బంజారా సేవా సంఘం జిల్లా అధ్యక్షులు బాలాజీ నాయక్, ప్రధాన కార్యదర్శి బాబు నాయక్, వర్కింగ్ ప్రెసిడెంట్ భూక్య వెంకటరమణ నాయక్ పిలుపునిచ్చారు. మండలంలోని చెర్లోపల్లి గ్రామ సమీపంలో ఉన్న సేవాఘడ్‌లో శ్రీ సంత్ సేవాలాల్ 284వ జయంతి ఉత్సవాలకు సంబంధించిన పోస్టర్లను బుధవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఫిబ్రవరి 13, 14, 15 తేదీల్లో జయంతి ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. దేశ విదేశాల్లో ఉన్న బంజారా లందరూ తరలివచ్చి సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. అనంతరం సేవాఘడ్ పరిసర ప్రాంతాలను కార్మిక శాఖ రాయలసీమ జోన్ డిప్యూటీ కమిషనర్ బాలు నాయక్ పరిశీలించారు. ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం నాయకులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

భార్య హత్య కేసులో భర్త అరెస్ట్

గుత్తి : కట్టుకున్న భార్యను హత్య చేసిన కేసులో భర్త ఖాజాను బుధవారం అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. గుత్తి పట్టణంలోని మారుతి నగర్‌లో నివాసం వుండే డ్రైవరు ఖాజా తన భార్య జుబేదాబీ ని డబ్బు కోసం వేధించి హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరించాడు. మృతురాలి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు విచారణ చేపట్టిన సిఐ ఎం.వెంకటరామిరెడ్డి, ఎస్‌ఐ ఆర్.శ్రీనివాసులు ఖాజాను అరెస్టు చేశారు. కేసు నమోదు చేసి నిందితున్ని కోర్టుకు హాజరు పరచగా న్యాయమూర్తి రిమాండ్‌కు ఆదేశించినట్లు వారు తెలియజేశారు.

125 లీటర్ల నాటుసారా పట్టివేత

గుత్తి : మండలంలోని ఉబిచెర్ల గ్రామం వద్ద సెబ్ అధికారులు 125 లీటర్ల నాటు సారాను పట్టుకున్నారు. కర్నూలు జిల్లా మిద్దె తండాకు చెందిన రమేష్ నాయక్ నాటుసారా తరలిస్తుండగా సెబ్ సీఐ బి.వరలక్ష్మి ఆధ్వర్యంలో బుధవారం దాడులు చేశారు. నాటుసారా విక్రేతను అరెస్టు చేసి అతని వద్ద ఉన్న 125 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నారు. నిందితున్ని కోర్టులో హాజరుపరుచగా న్యాయమూర్తి రిమాండ్‌కు ఆదేశించినట్లు ఆమె వెల్లడించారు.

గుత్తి ఉప తహశీల్దార్ హాజీవలి మృతి

గుత్తి : గుత్తి మండలం ఉప తహశీల్దార్ కె.హాజీవలి బుధవారం తెల్లవారుజామున మృతి చెందారు. హాజీవలి గతంలో గుత్తి ఇన్‌ఛార్జి తహశీల్దారుగా విధులు నిర్వహించారు. కొన్నేళ్లుగా ఆయన కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నారు. అనంతపురంలోని సవేరా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆయన కన్నుమూశారు. ఉప తహశీల్దారు మృతికి రెవెన్యూ అధికారులు, రాజకీయ నాయకులు సంతాపం వ్యక్తం చేశారు. తాడిపత్రిలోని ఉప తహశీల్దారు నివాసంలో ఉన్న పార్థివదేహాన్ని జిల్లా కబడ్డీ సంఘం అధ్యక్షులు సిబి.మంజునాథరెడ్డి, వైసీపీ నాయకుడు వై.రామ సుబ్బారెడ్డి సందర్శించి నివాళులర్పించారు.

గుండెపోటుతో విఆర్‌ఒ..

పెద్దపప్పూరు : వరదాయపల్లి, ముచ్చుకోట గ్రామాల విఆర్‌ఒగా పనిచేస్తున్న కిరణ్ గుండెపోటుతో మరణించారు. కొద్దికాలంగా ఆయన మెడికల్ లీవ్ మీద ఉన్నారు. బుధవారం తెల్లవారుజామున కర్నూలు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరణించారు. తహశీల్దారు షర్మిల, రెవెన్యూ సిబ్బంది కిరణ్ పార్థివదేహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. మృతుడి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

అన్నదానానికి విరాళం

రాయదుర్గం రూరల్ : శ్రీ సత్యసాయి జిల్లా రామగిరి మండలం పేరూరులో ఈనెల 18వ తేదీ అన్వర్ బాబా ఆరాధనోత్సవాల సందర్భంగా భక్తులకు అన్నదానం చేసేందుకు వాల్మీకి సంక్షేమ సేవా సమితి అధ్యక్షులు బండి కిష్టప్ప తనవంతుగా రూ.5100 విరాళం అందజేశారు. సర్వధర్మ నిలయ ట్రస్ట్ సభ్యులకు బుధవారం నగదు ఇచ్చారు. ఆ సేవా సమితి కార్యదర్శి ఎన్‌టి.సిద్ధప్ప, ఉపాధ్యక్షుడు మలకన్న, కోశాధికారి బండి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత గుండె వైద్యశిబిరం

నార్పల : సిద్ధరాచార్ల గ్రామ పంచాయతీ గొల్లపల్లి గ్రామంలోని ఆర్డీటీ స్కూల్లో సర్పంచి సాకే రామాంజినేయులు ఆధ్వర్యంలో ఉచిత గుండె వైద్య శిబిరాన్ని బుధవారం నిర్వహించారు. కిమ్స్ సవీరా ఆసుపత్రి డాక్టర్లు పలువురికి వైద్య పరీక్షలు నిర్వంచారు. మందులు పంపిణీ చేశారు. గుండెను ఆరోగ్యంగా ఎలా ఉంచుకోవాలో సలహాలు, సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో డాక్టర్ రామ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి బి.వెంకటరెడ్డి, హాస్పిటల్ మేనేజర్ అరీఫ్ శ్రీనివాస్, ఆసుపత్రి సిబ్బంది, వాలంటీర్లు, సుజాత మహేష్, గోపాలమిత్ర దొడ్డి నరసప్ప, యానిమేటర్ పీటర్, క్లాప్ మిత్ర దొడ్డి శంకర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

సమీక్ష సమావేశం

బొమ్మనహాల్ : ఉద్దేహాల్ గ్రామంలో వైసిపి గృహసారథులు, వాలంటీర్ల సమీక్ష సమావేశం పార్టీ మండల కన్వీనర్ ఈశ్వరి ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విప్ కాపు రామచంద్రారెడ్డి హజరయ్యారు. ఆయన మాట్లాడుతూ గృహ సారథులు, వాలంటీర్లు ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు అందిన తీరు గురించి వివరించాలన్నారు. లబ్ధిదారుల పేర్లు, రసీదు, స్టిక్కర్, వారి గ్రూప్ ఫొటో అప్లోడ్ చేయాలని తెలియజేశారు. 18 గ్రామాలకు చెందిన సర్పంచులు, వైసిపి నాయకులు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

ఉరవకొండ ఎంపిడిఒగా చంద్రమౌళి

ఉరవకొండ : ఉరవకొండ మండలం ఇన్‌ఛార్జి ఎంపిడిఒగా చంద్రమౌళి బుధవారం బాధ్యతలు తీసుకున్నారు. ఇక్కడ పనిచేస్తున్న ఎంపిడిఒ అమృతరాజు జిల్లా పరిషత్ కార్యాలయానికి బదిలీ అయ్యారు. దీంతో వజ్రకరూర్ ఎంపిడిఒగా విధులు నిర్వహిస్తున్న చంద్రమౌళిని ఉరవకొండ ఇన్‌ఛార్జి ఎంపిడిఒగా నియమిస్తూ జెడ్పి సిఇఒ భాస్కర్‌రెడ్డి ఆదేశాలు జారీచేశారు. బుధవారం ఆయన బాధ్యతలు చేపట్టారు. ప్రజా ప్రతినిధులు, అధికారుల సమన్వయంతో ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తానని పేర్కొన్నారు.

ఈ క్రాప్ బుకింగ్ తప్పనిసరి

గార్లదిన్నె : రైతులు రబీలో సాగు చేస్తున్న పంటలకు ఈ క్రాప్ బుకింగ్ తప్పకుండా చేయించుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి చంద్రనాయక్ సూచించారు. బుధవారం మండల పరిధిలోని తిమ్మంపేట, పాపినేపాలెం, శిరివరం గ్రామాల్లో చేస్తున్న ఈ క్రాప్ బుకింగ్‌ను ఆయన పరిశీలించారు. రబీ పంటలను ఆశించు పురుగులు, తెగుళ్లపై రైతులకు అవగాహన కల్పించారు. వాటిని నివారణ కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి పి.సోమశేఖర్, విహెచ్ఎ గుల్ ఫరేశా, ఎంపిఇఒ లలిత, రైతులు పాల్గొన్నారు.

సమగ్ర భూసర్వేపై అవగాహన

నార్పల : సమగ్ర భూ సర్వేపై స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో తహశీల్దార్ నారాయణస్వామి ఆధ్వర్యంలో రైతులకు బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దారు నారాయణస్వామి మాట్లాడుతూ భూముల రిసర్వే కార్యక్రమం వంద సంవత్సరాల తరువాత జరుగుతోందన్నారు. ఈ అవకాశాన్ని మండల రైతులు సద్వినియోగం చేసుకోవాలని, సమగ్ర భూసర్వేకి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జెడ్పిటిసి నాగరత్నమ్మ, ఎంపిపి నాగేశ్వరరావు, సహకార సొసైటీ అధ్యక్షుడు లోకనాథ్‌రెడ్డి, సర్పంచి సుప్రియ, మండల సర్వేయర్ బ్రహ్మానంద, గ్రామ సర్వేయర్లు, విఆర్‌ఒలు, గ్రామ కార్యదర్సులు, రైతులు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాలు ఏర్పాటు

ఉరవకొండ : విడపనకల్లు మండలం గడేకల్ గ్రామంలోని బిసి కాలనీలో బుధవారం విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేశారు. కొన్నేళ్లుగా విద్యుత్ స్తంభాలు లేక ఇబ్బందులు పడుతున్న విషయాన్ని కాలనీవాసులు ఎంపీపీ కరణం పుష్పావతి భీంరెడ్డి, సర్పంచి సుశీల ఉమాశంకర్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన వారు విద్యుత్ శాఖ అధికారులతో మాట్లాడి కాలనీలో ఎనిమిది విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేయించారు. త్వరలోనే విద్యుత్ లైన్లు కూడా లాగుతామని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఎంపిటిసి ఓబులేష్, హంపయ్య, ప్రసాద్, ఉమాశంకర్, సురేష్ యాదవ్, వెంకటేష్, రామన్న, రామాంజనేయులు, రాముడు పాల్గొన్నారు.

వేగంగా వాహనాలు నడిపితే చర్యలు

నార్పల : నార్పల పోలీస్‌స్టేషన్‌లో ట్రాక్టర్ల యజమానులతో ఎస్ఐ రాఘవరెడ్డి బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ..ఇటీవల వేలాపాలా లేకుండా డెక్కులు పెట్టుకుని అత్యంత వేగంగా వీధుల్లో ట్రాక్టర్లు నడుపుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. వేగ నియంత్రణ పాటించకపోతే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆర్‌సి, లైసెన్స్, ఇన్సూరెన్స్ వాహనంలోనే పెట్టుకోవాలని సూచించారు.

సర్వసభ్య సమావేశం

శింగనమల : స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపీపీ యోగేశ్వరి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం బుధవారం తూతూమంత్రంగా జరిగింది. సర్పంచులు, ఎంపిటిసిలు నామమాత్రంగానే హాజరయ్యారు. గత సమావేశంలో చర్చించిన సమస్యలే ఇప్పటికీ పరిష్కారం కాలేదని సభ్యులు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. స్పెషల్ ఆఫీసర్ ఉమా శంకరమ్మ, ఎంపీడీవో నిర్మలా కుమారి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.